పర్యావరణ హితం.. ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం

- పాతవాటితో నూతన వస్తువుల తయారీ లక్ష్యం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- చినగంట్యాడలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రారంభం



చినగంట్యాడలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



పాత టైర్లతో తయారు చేసిన కుర్చీలు, స్టూల్స్‌పై కూర్చున్న అతిథులు

గాజువాక: పాత వస్త్రాలు, పని చేయని వస్తువులతో కొత్త వస్తువులను తయారు చేయడమే లక్ష్యంగా ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. చినగంట్యాడలో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని చేయని వస్తువులతో నూతన వస్తువులను తయారు చేసి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ప్రక్రియకు జీవీఎంసీ ప్రణాళికలను సిద్ధం చేసిందని, అందులో భాగంగానే ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో జీవీఎంసీ ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. డ్వాక్రా మహిళల ద్వారా కొత్త వస్తువుల తయారీకి రాష్ట్ర ప్రభుత్వం పలు ఏర్పాట్లు చేసిందన్నారు. పాత గుడ్డలతో కొత్త సంచులను, పనికిరాని వస్తువులతో రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్ విధానం ద్వారా కొత్త వస్తువుల రూపకల్పనకు అవకాశం ఏర్పడుతుందన్నారు. పాత పుస్తకాలను ఎవరైనా తీసుకొచ్చి ఈ కేంద్రంలో ఇస్తే వాటితో ఒక గ్రంథాలయాన్ని కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ప్రజలు తమ ఇళ్లలో పనికిరాని వస్తువులను ఇకపై రోడ్లపైన, కాలువల్లోను పడేయకుండా ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లకు అందించాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, ఎస్ఈ గోవిందరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సిరట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సీడీఎంఏ

- చిన్నారుల సంరక్షణపై ఆరా
- మిండి హైస్కూల్‌లో వసతుల పరిశీలన



మిండి హైస్కూల్ విద్యార్థికి విద్యా కానుక అందిస్తున్న సీడీఎంఏ కోటేశ్వరరావు, డీఈవో చంద్రకళ



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణికి వైఎస్సార్ పోషణ కిట్‌ను అందిస్తున్న సీడీఎంఏ కోటేశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని అంగన్‌వాడీ సెంటర్, మిండి జిల్లా పరిషత్ పాఠశాలలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్, విశాఖ ప్రత్యేక అధికారి పి.కోటేశ్వరరావు బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ సెంటర్‌కు విచ్చేసిన ఆయన చిన్నారుల తల్లులతో మాట్లాడారు. కేంద్రంలో సౌకర్యాలు, పిల్లల సంరక్షణ తదితర అంశాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ సెంటర్‌కు మినరల్ వాటర్ ప్లాంట్, టాయిలెట్లు ఉన్నాయా అంటూ అంగన్‌వాడీ సూపర్ వైజర్లను, టీచర్‌ను ప్రశ్నించారు. టాయిలెట్స్ నిర్మాణంలో ఉన్నాయని, అంగన్‌వాడీ సెంటర్‌ను ఎంపీపీ పాఠశాలలోని ఒక గదిలో నిర్వహించడం వల్ల పాఠశాలకు వచ్చే మంచినీటినే వినియోగించుకుంటున్నామని వారు తెలిపారు. సీడీపీవో అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లో సమస్యలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు రుక్సానా బేగం, లక్ష్మీ, స్రవంతి, టీచర్ దుర్గాబాయి, హెల్పర్లు సీతామహాలక్ష్మి, వెంకటలక్ష్మి, ఈశ్వరమ్మ, సచివాలయ మహిళా పోలీసులు గాయత్రి, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

మిండి జెడ్పీ హైస్కూల్లో..

మిండి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సీడీఎంఏ కోటేశ్వరరావు, డీఈవో ఎల్.చంద్రకళ సందర్శించారు. పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూం, మినరల్ వాటర్ ప్లాంట్, టాయిలెట్లు, నూతనంగా నిర్మిస్తున్న తరగతి గదులతో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల డ్రాపవుట్లపై హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్. ఆంజనేయ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం సమాచారాన్ని పూర్తి చిత్రాలతో అధికారికి వివరించారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం, తరగతులు, ఉపాధ్యాయులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పరిస్థితులపై సీడీఎంఏ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థికి జగనన్న విద్యాకానుక కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఏ.వి.జి.వర్మ, గాజువాక జెడ్సీ పి.సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్, ఎంఈవో ఎం.సునీత, పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లోని పలు వార్డులకు గురువారం, శుక్రవారం నీటి సరఫరా ఉండదని నీటి సరఫరా విభాగం సహాయ ఇంజినీర్లు పి.కేదార్‌నాథ్, టి.రాజ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గాజువాక జోన్‌లోని మంచినీటి శుద్ధి కర్మాగారాలకు నీటిని అందిస్తున్న ఏలేరు ఎడమ కాలువకు భారీ వర్షాల కారణంగా గండి పడిందని తెలిపారు. ఈ కారణంగా నీటి లభ్యత నిలిచిపోవడంతో 64, 65, 70, 73 (పార్టు), 74, 75, 76 (పార్టు), 86, 87, 77, 79, 85, 88 వార్డుల్లో రెండు రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

74వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులను కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిద్దేశ్వరంలోని తోటదొడ్డిలో ప్రహరీ, డ్రైనేజీ పనులను గత నెలలో ప్రారంభించామని తెలిపారు. ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వార్డులో అభివృద్ధి పనులు 90 శాతం పూర్తి కావచ్చాయని తెలియజేశారు. వార్డులో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పూతి పోతరెడ్డి, దల్లి అప్పారావు, సతీష్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఉక్కునగరం: ఈ నెల 12,13 తేదీల్లో నగరంలో నిర్వహించనున్న ఏఐటీయూసీ విశాఖ జిల్లా 13వ మహాసభలను విజయవంతం చేయాలని స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎస్.ఎన్. రావు, డి.ఆదినారాయణ కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ మహాసభల్లో కార్మిక సమస్యలపై చర్చించనున్నారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, నర్సింగరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐటీఐ రెండో విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్

పెదగంట్యాడ: గాజువాకలోని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 10వ తరగతిలో జీపీఏ ఆధారంగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. 10వ తరగతిలో జీపీఏ 10 నుంచి 7 వరకు 3వ తేదీన, జీపీఏ 6 నుంచి చివరి వరకు 4వ తేదీన ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఐటీఐకి దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ ఫారం, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డుపై దరఖాస్తు చేసిన అభ్యర్థులు 3వ తేదీ ఉదయం 9 గంటలకు వారి ఆర్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

చేతి బోరు ప్రారంభం



బోరు వద్ద పూజలు చేస్తున్న కార్పొరేటర్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు కాపులుప్పాడ గ్రామంలోని బ్లూ ఫీల్డ్ లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన చేతి బోరును కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి బుధవారం ప్రారంభించారు. లేఅవుట్ ప్రతినిధి సురేష్ మాట్లాడుతూ స్థానికంగా విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు నీటి సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. ఆ సమయంలో వినియోగించుకునేలా చేతిబోరును ఏర్పాటు చేసిన కార్పొరేటర్ గోవింద రెడ్డికి, జీవీఎంసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. లేఅవుట్ కార్యదర్శి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో మౌలిక వసతులకు కృషి

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 73, 75 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



73వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ సుజాత తదితరులు

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 73వ వార్డులో 35 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ భూపతిరాజు సుజాతతో కలసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.35 లక్షలతో వినాయకనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో భూపతిరాజు శ్రీనివాస్, గొరుసు సత్యం, వి.రామకృష్ణ రాజు, పైడినాయుడు, పాల అప్పలరెడ్డి, జయప్రభ తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డులో రూ.71లక్షలతో..

జీవీఎంసీ 75వ వార్డులో రూ.71 లక్షలతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. సీతానగరం ఎస్సీ కాలనీలో రూ. 30 లక్షల రూపాయలతో సామాజిక భవనం, నెల్లిముక్కు నాయి బ్రాహ్మణ వీధిలో రూ.30 లక్షలతో సామాజిక భవనం, అయ్యన్నపాలెం పార్కులో ఓపెన్ జిమ్ కోసం రూ.11 లక్షల పనులకు కార్పొరేటర్ పులి ఝాన్సీ లక్ష్మీభాయ్‌తో కలసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ 76వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస రెడ్డి, మార్టుపూడి పరదేశి, పులి రమణారెడ్డి, గొందేశి వెంకట రమణారెడ్డి, కొయ్య భారతి, వంశీకృష్ణ యాదవ్, నక్క వెంకటరమణ, జీ.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై దీక్షలు



ఆటోనగర్ ఏపీ ట్రాన్స్ కో కార్యాలయం వద్ద దీక్షలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు దీక్షలు చేపట్టారు. ఆటోనగర్‌లోని ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో వైజాగ్ జోన్ జేఏసీ చైర్మన్ జి.వి.శేఖర్ మాట్లాడారు. 2022 ఏప్రిల్ నుంచి చెల్లించవలసిన పీఆర్సీ చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పనిభారం ఎక్కువ అవుతున్న సమయంలో సిబ్బందిని పెంచాలని దీక్షలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎస్.వెంకటరావు, కార్యదర్శి ఎ.గోపి, వాసుదేవరావు, ఎం.ఎ.ఎస్.నాయుడు, దొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో విద్యార్థులకు మేలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నర్సింహులు

గాజువాక: విద్యార్థుల వికాసానికి జాతీయ విద్యా విధానం దోహదం చేస్తుందని రాయలసీమ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.నర్సింహులు అన్నారు. జాతీయ విద్యా విధానం–2020పై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంప్రదాయ విద్యా విధానానికి బదులుగా నూతన సాంకేతికతను ఉపయోగించి విద్యార్థుల ఆలోచనలలో మార్పు తెచ్చే విధంగా బోధన జరగాలన్నారు. దానికనుగుణంగా అధ్యాపకులు తమ బోధనా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. 2030 నాటికి ప్రతీ కళాశాల తప్పనిసరిగా అటానమస్ అవ్వాల్సి ఉందని, విద్యార్థులకు విలువ ఆధారిత అవకాశాలను ఇప్పించినప్పుడే అది సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడి రథానికి రక్షణ

సాక్షి ఎఫెక్ట్..



జగన్నాథస్వామి రథం కోసం నిర్మించిన పాక

అగనంపూడి: జగన్నాథుడి రథానికి అధికారులు రక్షణ కల్పించారు. దాదాపు 190 సంవత్సరాల చరిత్ర కలిగిన అగనంపూడి జగన్నాథ స్వామి ఆలయంలో లక్షల వ్యయంతో నిర్మించిన స్వామి వారి రథానికి సరైన రక్షణ లేక ఎండకు ఎండి, వానకు తడుస్తోంది. దీనిపై 'గూడు లేదు..నీడ కానరాదు' శీర్షికతో గత నెల 31న సాక్షి పత్రికలో కథనం వెలువడింది. దీనిపై జగన్నాథస్వామి ఆలయ ఈవో రమాబాయి స్పందించారు. పాలకమండలి, ఈవో ఆధ్వర్యంలో రథం భద్రపరిచేందుకు తాటాకు కమ్మలతో పాకను సిద్ధం చేశారు. జగన్నాథుడి రథానికి రక్షణ కల్పించడంతో భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండో రోజు పింఛన్ల అందజేత



రాములమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శశి



మహాలక్ష్మినాయుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ పావని

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ రెండో రోజు బుధవారం కొనసాగింది. జీవీఎంసీ 68వ వార్డు మిందిలో పల్లా రాములమ్మకు వార్డు వలంటీర్ శశి, సచివాలయ కన్వీనర్ పోలవరపు శ్రీహరి వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు.

నగరంలో ఆస్పత్రికి వచ్చి పింఛన్ పంపిణీ

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్ నగర్‌కు చెందిన పొలిమేర మహాలక్ష్మినాయుడు పెదవాల్తేరులోని ఛాతీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న వలంటీర్ నక్క పావని మంగళవారం ఆస్పత్రికి వచ్చి ఆయనకు వృద్ధాప్య పింఛన్ అందించారు. అంత దూరం వచ్చి పింఛన్ అందించిన వలంటీర్ పావనికి మహాలక్ష్మినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



పింగళి వెంకయ్యకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

అగనంపూడి: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని 85వ వార్డు పెదమడక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు కేక్, స్వీట్లు పంచారు. విద్యార్థులతో జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ చైర్మన్ మోటూరి రమణ మాట్లాడుతూ భారతీయులు సగౌరవంగా తలెత్తుకుని సెల్యూట్ చేసేలా పతాకాన్ని రూపొందించిన వెంకయ్య మన తెలుగు వారు కావడంతో తెలుగుజాతి గర్వించదగిన విషయం అన్నారు. నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బళ్ల పైడిరాజు, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో 'క్విట్ కార్పొరేట్'

9న నిరసనలు



దీక్షలో పాల్గొన్న కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ కో–కన్వీనర్ అయోధ్యరామ్ విమర్శించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ నినాదంతో ఆగస్టు 9వ తేదీన జరగనున్న నిరసన కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 902వ రోజు సంస్థలోని సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతతో బీజేపీ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ అంశంగా మలచే దిశగా కార్మికవర్గం అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు వై.టి.దాస్, విల్లా రామ్మోహనకుమార్, వరసాల శ్రీనివాసరావు, రమణరావు, ఏ శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజా భాగస్వామ్యం అవసరం

- జెడ్సీ సింహాచలం
- విశాఖ డెయిరీలో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి




డెయిరీలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

అక్కిరెడ్డిపాలెం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలో 23వ స్థానంలో ఉన్న విశాఖ నగరం ఇప్పుడు 4వ స్థానంలో నిలిచిందని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. విశాఖ డెయిరీలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖను దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు జీవీఎంసీ అధికారులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. విశాఖ డెయిరీ జీఎం వెంకట్ మాట్లాడుతూ విశాఖ డెయిరీలో ప్లాస్టిక్ నిరోధానికి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రవేశపెట్టామని తెలిపారు. కొన్ని డెయిరీ పార్లర్లలో కేజీ పాల కవర్లకు అరలీటర్ పాలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో లూజ్ పాలను ట్యాంకర్ల ద్వారా కొన్ని పాయింట్లలో విక్రయించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిరోధానికి తీసుకోవల్సిన చర్యలపై కార్యక్రమంలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు, డెయిరీ ఉద్యోగులకు ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వడ్డాది శ్రీనివాసరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు కె.అప్పలరాజు, ఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అలవెన్సులు చెల్లించాలి

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల ప్రత్యేక అలవెన్సులపై యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సింటర్ ప్లాంట్ విభాగాధిపతి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు చెల్లించాల్సిన ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ, ఐఆర్‌లను కాంట్రాక్టర్లు నిలిపివేయడం అన్యాయమన్నారు. ఈ అంశంపై యాజమాన్యంపై ఒత్తిడి తేవాల్సిన కాంట్రాక్టర్లు కార్మికులకు చెల్లింపులు నిలిపి వేయడం దుర్మార్గమన్నారు. స్కిల్డ్ కార్మికులకు బోనస్, ఈఎస్ఐ, నోటీసు పే నిలిపివేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి, జి. శ్రీనివాస్ (సిటూ), పి.వి. రమణమూర్తి (ఇంటక్), సత్యారావు (హెచ్‌ఎంఎస్), సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంపై వాగ్వాదం



మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో వాగ్వాదం చేస్తున్న రైతులు

అక్కిరెడ్డిపాలెం: వెంకటేశ్వరకాలనీలో లలితా దేవి ఆలయం ఎదురుగా వంతెన నిర్మాణంపై టీడీపీ నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. దీంతో వంతెన నిర్మిస్తున్న సుమారు 42 మంది రైతులు అక్కడికి చేరుకుని.. టీడీపీ నాయకులను అడ్డుకున్నారు. ఆందోళనకు నాయకత్వం వహించిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను శాంతింపజేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ లక్షలాది మంది కార్మికులకు అవసరమైన ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఇక్కడ అక్రమ కట్టడం సరికాదన్నారు. దీని వల్ల ఆస్పత్రి నిర్మాణం ఆగిపోయే ప్రమాదం ఉందని, వంతెన నిర్మాణాన్ని విరమించుకోవాలని రైతులను కోరారు. రైతులు మాట్లాడుతూ తమ పొలాలకు రోడ్డు మార్గం లేకపోతే నష్టపోతామన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ పొలాలకు రహదారి ఏర్పాటు చేసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రశేఖరరావు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి, చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనకు సంబంధించి గాజువాక ఎస్ఐ టి.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూర్మన్నపాలెం దరి రాజీవ్‌నగర్‌కు చెందిన చింతా చంద్రశేఖరరావు (50) ఫార్మా కంపెనీలో పని చేస్తున్నారు. బుధవారం పనిమీద గాజువాక వచ్చిన ఆయన పాతగాజువాక నుంచి షీలానగర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో, పాతగాజువాక జంక్షన్‌లో ఆయన వాహనాన్ని వెనుక నుంచి ఖాళీ ట్రాలీ వ్యాను ఢీ కొట్టింది. అదుపు తప్పిన చంద్రశేఖరరావు కుడి తొడ వ్యాను చక్రం కింద పడి విరిగిపోయింది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాద వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే నాగిరెడ్డిని కలిసిన పోర్టు కార్మికులు

యాజమాన్యంతో చర్చలకు వినతి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 30 రోజులుగా నిరసనలు చేస్తున్నా అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కార్మికులంతా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని బుధవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యను ఏకరువు పెట్టారు. యాజమాన్యంతో చర్చలు జరపాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఇప్పటికే టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో పాటు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు సమస్యను వివరించామన్నారు. కార్మికులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, మాద అప్పారావు, గంటిపిల్లి లక్ష్మయ్య, నొల్లి స్వామి, సత్యానందం తదితరులున్నారు.